క్లుప్తంగా

మాసశివరాత్రి పూజలు



నరసరావుపేట ఈస్ట్: రావిపాడురోడ్డు బాలయ్యనగర్‌లోని శ్రీకళ్యాణ సుందరేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మాస శివరాత్రిని పురస్కరించుకొని స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు అనంతరం ప్రత్యేక అలంకరణలు చేసి భక్తులను దర్శనానికి అనుమతించారు. సాయంత్రం శివస్వాముల ఆధ్వర్యంలో శివనామ పారాయణం నిర్వహించారు. ఆలయ అర్చకుడు కొమ్మాలపాటి మణికంఠశర్మ పూజాధికాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నాదెండ్ల మండల ప్రత్యేకాధికారిగా బీజే బెన్ని



నాదెండ్ల: నాదెండ్ల మండల ప్రత్యేకాధికారిగా పల్నాడు జిల్లా ఉద్యాన శాఖ డెప్యూటీ డైరెక్టర్ బీజీ బెన్ని నియమితులయ్యారు. శుక్రవారం ఆయన విధుల్లో చేరారు. ఇప్పటి వరకూ ప్రత్యేకాధికారిగా పని చేసిన కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ ధనలక్ష్మి సెలవుపై వెళ్లటంతో బీజే బెన్నిని ఉన్నతాధికారులు నియమించారు. ఆయన 2020–21లో నాదెండ్ల మండల ఎంపీటీసీ ఎన్నికల అధికారిగా పనిచేశారు.

అగ్ని ప్రమాదంలో రూ.లక్ష ఆస్తి నష్టం



వినుకొండ టౌన్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రేకుల ఇల్లు దగ్ధం కావడంతో రూ.లక్ష నష్టం వాటిల్లింది. వినుకొండ అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి అధికారి ఎం.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపిన వివరాలు.. పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులోని చేప బిల్డింగ్ వెనుక ఉన్న సిహెచ్. మారుతి కుమార్‌కు చెందిన రేకుల ఇంటిలో అగ్ని ప్రమాదం విషయాన్ని స్థానికులు సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. ఘటనా స్థలానికి సకాలంలో చేరుకొని మంటలను అదుపులోకి తీసుకురావడం జరిగిందన్నారు. అగ్ని ప్రమాదంలో విద్యుత్ మీటర్‌తో పాటు గృహోపకరణాలు, విద్యుత్ పరికరాలు కాలిపోయినట్లు వివరించారు.

ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలి



వినుకొండ(నూజెండ్ల): స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జాతీయ కీటక జనిత రోగ నియంత్రణ కార్యక్రమం వాల్‌పోస్టర్లను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని అన్నారు. పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యం మెరుగు ద్వారానే అంటు వ్యాధులను అరికట్టవచ్చని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



శావల్యాపురం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గల్లా రవికృష్ణ తెలిపిన వివరాలు.. నూజెండ్ల మండలం అయినోలు గ్రామానికి చెందిన షేక్ బాజీ కుటుంబ సభ్యులతో గుంటూరు ఆటోలో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఆటోలో కుటుంబ సభ్యులు అందరు బయలుదేరగా, మృతుడు బాజీ ద్విచక్ర వాహనంపై స్వగ్రామం బయలుదేరాడు. ఈ క్రమంలో శావల్యాపురం సమీపంలో మార్కాపురం నుంచి విజయవాడకు వెళుతున్న గుంటూరు–1 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వినుకొండ వైపునకు వస్తున్న బైకును అతి వేగంతో ఢీకొట్టింది. ఘటనా స్థలంలోనే షేక్ బాజీ మృతి చెందాడు. నరసరావుపేట నుంచి వినుకొండకు వస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదం జరిగిన తీరు ఆరా తీశారు. ఆర్టీసీ బస్ డ్రైవరును, బస్సును పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికృష్ణ తెలిపారు.

పేదలు ఆర్థికంగా ఎదిగేలా జగనన్న పాలన

- రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: పేదలు ఆర్థికంగా ఎదిగేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. పట్టణంలోని 34వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత వార్డులో ఉన్న డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ జనం కష్టాలు తెలిసిన ప్రభుత్వం తమదని చెప్పారు. పేదలందరికీ నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందేలా తమ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తెచ్చిందని వివరించారు. ఏ కుటుంబమైనా అభివృద్ధి చెందాలంటే నాణ్యమైన విద్యనందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అందుకోసం ముఖ్యమంత్రి జగనన్న ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ఇంగ్లిష్ మీడియం, జగనన్న విద్యాకానుక, విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద వంటి ఎన్నో పథకాలతో పేద విద్యార్థులకు ఎంతో మేలు చేస్తున్నారని వివరించారు. దీనికి తోడు వైద్య రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆరోగ్య శ్రీని దాదాపు అన్ని వ్యాధులకు వర్తింప చేస్తున్నామన్నారు. రూ. 16వేల కోట్లతో గ్రామ స్థాయిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం నుంచి మెడికల్ కళాశాలల నిర్మాణం వరకు ఎంతో పకడ్బందీగా చేపడుతున్నామని వివరించారు. ప్రతి ఒక్కరికి సొంతింటి కల నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం అందరికీ ఇళ్లు, జగనన్న కాలనీలు నిర్మిస్తోందని పేర్కొన్నారు. జగనన్న కాలనీలలో పేదవారి సొంతింటి కలలు సాకారం అవుతాయని వివరించారు. ప్రజా సంక్షేమం కోసం ఎంతో చేస్తున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం పథకాలను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వార్డు కౌన్సిలర్ వడితే కోట్యానాయక్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, నాయకులు తోట రాజేంద్రప్రసాద్, అల్లడి ఆదిబాబు, శొంఠి శ్రీను, మంత్రునాయక్, వెంకట్‌నాయక్, నరసింహనాయక్, వెంకట్రావు, శ్రీనునాయక్, బాణావతు బాబునాయక్ పాల్గొన్నారు.

ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న వైఎస్ జగన్



పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం

నరసరావుపేట: ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని పదో వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం శుక్రవారం నిర్వహించారు. ప్రకాష్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్ వెనుకవైపు, 60 అడుగుల రోడ్డు, జూపల్లి సెంటర్లలో పర్యటించారు. సంక్షేమ పథకాలను గురించి తెలియచేస్తూ వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడున్నరేళ్లల్లో వార్డులో ఉన్న ప్రజలకు రూ.5.5కోట్లతో సంక్షేమ పథకాలు, మరో 150మంది పేదలకు ఇళ్లపట్టాలు, టిడ్కో గృహాలు అందజేశామని వివరించారు. వలంటీరు, సచివాలయ వ్యవస్థల రాకతో ప్రజలు సంతోషంగా ఉనారన్నారు. ప్రతి పింఛన్‌దారుడికి ఉదయం ఆరు గంటలకే పింఛన్ అందజేస్తుండటంతో వారంతా సంతోషిస్తున్నారని గుర్తు చేశారు. రోడ్లపై సభలు, సమావేశాలు నిర్వహించి ప్రజల ప్రాణాలను చంద్రబాబు తీస్తున్నాడని ఆరోపించారు. లోకేష్ పాదయాత్ర చేపట్టబోతున్నాడని, దాని వలన ప్రజలకు, రాష్ట్రానికి ఒరిగేదిఏమీ ఉండబోదని పేర్కొన్నారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డి కావటం ఖాయమని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంఈ డి.శ్రీనివాసరావు, ఏఈ స్వర్ణరాజు, రెవెన్యూ ఆఫీసర్ సూర్యనారాయణరెడ్డి, విద్యుత్‌శాఖ ఏఈ సురేంద్రబాబు, సీనియర్ అకౌంటెంట్ బంగారయ్య, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ ఖాదర్ బాషా, వార్డు నాయకులు పావురాల శ్రీనివాసరెడ్డి, యర్ర అనీల్, బాలా, డి.జ్యోతి, రామిరెడ్డి, మల్లెల అనీల, షేక్ సర్దార్, బొగ్గరం మూర్తి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంతో ప్రజలకు మేలు



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- బొగ్గరంలో గడప గడపకు మన ప్రభుత్వం

ఈపూరు: అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. మండలంలోని బొగ్గరంలో గడప గడపకు మన ప్రభుత్వం శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం నుంచి చేకూరిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటి వరకు కులమతాలకు, పార్టీలకతీతంగా ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు చెప్పారు. సమస్యలు ఉంటే గ్రామాల్లో వలంటీర్లు ఉన్నారని, అలాగే సచివాలయం వ్యవస్థ గ్రామాల్లోనే ఉన్నాయని, అప్పటికీ కూడా సమస్యలు పరిష్కారం కాకపోతే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలోనే అత్యధిక పథకాలను ప్రవేశపెట్టి గొప్ప పేరు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. అభివృద్ధిని చూసి సంతోషించలేక మరలా తాము అధికారంలోకి రాలేమోననే భయంతో తెలుగుదేశం పార్టీ నాయకులు లేనిపోని అపవాదులు సృష్టిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తుర్లపాటి చౌడయ్య, పార్టీ మండల అధ్యక్షులు కోపెల దేవరాజ్, పార్టీ నాయకులు శాకమూరి బుచ్చయ్య, గోనుగుంట్ల వెంకట హనుమయ్య, మందపాటి రామారావు, ఎం.అంజయ్య, దుద్దుగుల జానయ్య, విద్యుత్ ఏడీఏ వెంకటేశ్వరరెడ్డి, తహసీల్దార్ విజయజ్యోతికుమారి, ఎంపీడీఓ ఉషాకిరణ్ పాల్గొన్నారు.

రైతులు ఆదాయాన్ని పెంచుకోవాలి

నాబార్డు డీజీఎం కార్తీక్



రైతులకు శిక్షణ సర్టిఫికెట్లు అందజేస్తున్న నాబార్డు డీజీఎం కార్తీక్

నరసరావుపేట రూరల్: రైతులు దళారులపై ఆధారపడకుండా స్వయంగా వ్యాపారాలు నిర్వహించుకుని ఆదాయాన్ని పెంచుకోవాలని నాబార్డు డీజీఎం కార్తీక్ సూచించారు. నాబార్డ్ ఆధ్వర్యంలో జిల్లాలోని రైతు ఉత్పత్తిదారుల సంఘం(ఎఫ్‌పీఓ) డైరెక్టర్లకు వ్యాపార నిర్వహణ, చట్టపరమైన అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం అరండల్‌పేటలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నాబార్డు డీడీఎం కార్తీక్ మాట్లాడుతూ రైతు ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు ఎఫ్‌పీఓ– సీఎస్ఎస్ స్కీమ్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. మూడు నుంచి ఐదేళ్ల వరకు నాబార్డ్ ద్వారా ఆర్థిక సహకారం లభిస్తుందని పేర్కొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత రొంపిచర్ల టీమ్



విజేతకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

రొంపిచర్ల: మండలంలో వి.రెడ్డిపాలెంలోని ఏపీ మోడల్ స్కూల్ అండ్ కాలేజీ క్రీడా ప్రాంగణంలో మర్రిచెట్టుపాలెం ప్రీమియం లీగ్ పేరుతో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. పోటీలలో మొదటి బహుమతి రొంపిచర్ల టీమ్‌కు రు.25,000, ద్వితీయ బహుమతి రెడ్డిపాలెం టీమ్‌కు రు.15,000, తృతీయ బహుమతి మునమాక టీమ్‌కు రు.10,000 దక్కించుకున్నాయి. అదే విధంగా మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్‌గా ఎంపికైన గోపిచంద్‌కు రు.3,116, బెస్ట్ బ్యాట్‌మెన్‌గా ఎంపికైన గంటా రవికి రు.2,116, బెస్ట్ బౌలర్‌గా ఎంపికై న రామిరెడ్డికి రు.2,116 నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి.రవినాయక్ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆడాలన్నారు. క్రీడలలో గెలుపు ఓటములు సహజమని అన్నారు. క్రీడల వలన మానసిక ఉల్లాసం కలుగుతుందని పేర్కొన్నారు. అనంతరం ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు రాత పరీక్ష

నాదెండ్ల: గణపవరం చుండి రంగనాయకులు డిగ్రీ కళాశాల ఇండోర్ స్టేడియంలో శుక్రవారం 25–ఆంధ్రా బెటాలియన్ ఎ–సర్టిఫికెట్ పరీక్షలు నిర్వహించారు. రాత పరీక్షలకు జేసీఓ భరత్‌కుమార్, సీహెచ్ ఆనందబాబు, హవాల్దార్ సాగర్ పటేల్, ఏఎన్‌ఓలు లక్ష్మణరావు, శిఖా చంద్రమౌళి, అప్పారావు, శబరి, రసూల్, విజయ్‌కుమార్ పర్యవేక్షించారు. పరీక్షకు మురికిపూడి, గణపవరం, చిలకలూరిపేట శారద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, చిలకలూరిపేట బీఆర్‌జీజీ, వేద, మద్దిరాల నవోదయ పాఠశాలలకు చెందిన 136 మంది ఎన్‌సీసీ విద్యార్థులు హాజరయ్యారు. రాతపరీక్ష అనంతరం వ్యాయామ పరీక్షలు నిర్వహించారు. ఎంపికైన వారికి త్వరలో ఎ–సర్టిఫికెట్ ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మెంబరు అశోక్‌కు సన్మానం

నరసరావుపేట: పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మానిటరింగ్ కమిటీ మెంబరుగా ఎన్నికైన న్యాయవాది, వైఎస్సార్ సీపీ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మల్లెల అశోక్‌ను శుక్రవారం ఘనంగా సత్కరించారు. టూ టౌన్ మహిళా సమైక్య అధ్యక్షురాలు సయ్యద్‌ఫాతిమా, పెద్దకాజా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గోపిరెడ్డి యువసేన అధ్యక్షులు పంగులూరి విజయ్‌కుమార్, ఐక్యవేదిక అధ్యక్షుడు పానుగుపాటి పూర్ణచంద్రరావు, మహిళా సంఘ నాయకురాళ్లు కొత్తపల్లి పూర్ణమ్మ, సుజాత, షకీలా పాల్గొని అభినందించారు.

పథకాల అమలులో అధికారులు కీలకపాత్ర పోషించాలి

మండల ప్రత్యేక అధికారి వరలక్ష్మి



సదస్సులో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి వరలక్ష్మి

శావల్యాపురం: ప్రభుత్వ పథకాలు అమలు తీరులో అధికారులు కీలకపాత్ర పోషించాలని మండల ప్రత్యేక అధికారి జిల్లా షెడ్యూల్ తెగల సంక్షేమ సాధికారిత అధికారి లోతేటి వరలక్ష్మి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరు ఆదేశాలు మేరకు మండల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ అధికారుల అందరూ సమన్వయంతో విధులు నిర్వహించి అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా క్షేత్రస్థాయిలో బాధ్యత వహించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ పి.సీతారామయ్య, తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, ఈఓపీఆర్డీ పి.సుగుణ, మండల వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం, ఏఈ గాంధీ పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ

నరసరావుపేట ఈస్ట్: విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఏ మారుతి వరప్రసాద్ పిలుపునిచ్చారు. అరండల్‌పేటలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏఐటీయూసీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ ఉద్యమం ప్రారంభమై 600 రోజులైన సందర్భంగా ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు చేపట్టిన ఆందోళనలో ప్రజలు పాల్గొనాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం బహుళజాతి సంస్థకు విశాఖ ఉక్కును కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. ఈనెల 27న విశాఖపట్నంలో జరగనున్న భారీ ర్యాలీలో ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, వినుకొండ నియోజకవర్గ ఏఐటీయూసీ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, వైదన వెంకట్ పాల్గొన్నారు.

మండల సమస్యలపై కలిసికట్టుగా పనిచేద్దాం

నాదెండ్ల: మండల అభివృద్ధి, గ్రామాల సమస్యల పరిష్కారంపై కలిసికట్టుగా పనిచేద్దామని మండల ప్రత్యేకాధికారి బీజే బెన్ని చెప్పారు. శుక్రవారం ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను మండల స్థాయి అధికారులు, సర్పంచులు శుక్రవారం ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. మండలపరిషత్ కార్యాలయంలో ఆయనతో మండల అభివృద్ధి, గ్రామాల్లో సమస్యలపై చర్చించారు. గతంలో ఎంపీటీసీ ఎన్నికల సమయంలో ఆయన ఎన్నికల పర్యవేక్షకులుగా వ్యవహరించారు. ప్రస్తుతం మండల ప్రత్యేకాధికారిగా నియమితులైన ఆయన్ను ఎంపీపీ తలతోటి రాణి, ఎంపీడీఓ జాకీర్‌హుసేన్, సర్పంచులు బత్తుల సీతారామిరెడ్డి, కాట్రగడ్డ రామకృష్ణ, నాయకులు మద్దూరి కోటిరెడ్డి, రత్తయ్య తదితరులు పూలమాలలతో స్వాగతం తెలిపారు.

రహదారి భద్రతా నిబంధనలు పాటించాలి

జిల్లా రవాణా శాఖ అధికారి పరందామరెడ్డి



మాట్లాడుతున్న పరందామరెడ్డి

నరసరావుపేట రూరల్: రహదారి భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని జిల్లా రవాణాశాఖ అధికారి టీకే పరందామరెడ్డి తెలిపారు. 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా జొన్నలగడ్డలోని తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు, బస్సు డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సదస్సుకు హాజరైన పరందామరెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్ రోజురోజుకు పెరిగిపోతున్న దృష్ట్యా రహదారి నిబంధనలు పాటించడం ద్వారా సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని తెలిపారు. నిబంధనలు పాటించకపోవడం వలనే యువత ఎక్కువగా రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. విద్యాసంస్థల బస్సు డ్రైవర్లు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. మద్యానికి బానిస కావద్దని చెప్పారు. ద్విచక్ర వాహనం నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపటం ప్రమాదకరమని పేర్కొన్నారు. సదస్సులో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, శ్రావ్య, కళాశాల ప్రొఫెసర్ ఎస్.రామారావు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లు నిర్దేశిత ప్రాంతాల్లో బస్సులు ఆపాలి

చిలకలూరిపేట టౌన్: ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ టీవీ నాగలక్ష్మి కోరారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన భద్రతా వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు నిత్యం అప్రమత్తంగా వ్యవహరించాలని, వాహనాలను నడిపే క్రమంలో సిగ్నల్స్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రయాణికులను ఎక్కించుకునే క్రమంలో నిర్దేశిత ప్రాంతంలోనే బస్సును నిలపాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాళ్లబండి సాయిరామ్ పాల్గొన్నారు.

వరి పంట కోత ప్రయోగం



పంట కోత ప్రయోగాన్ని నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

ఈపూరు: మండలంలోని కొండాయపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలోని బొగ్గరంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వరి పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ పంట కోత ప్రయోగాల ద్వారా పంట యొక్క దిగుబడి అంచనా వేయడం జరుగుతుందని జిల్లా ప్రణాళిక అధికారి కె.ముక్తేశ్వరరావు తెలిపారు. రైతు నాశన కోటయ్య పొలంలో జేజీఎల్–384 రకం సుమారుగా ఎకరానికి 32 బస్తాలు దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మండల స్టాటిస్టిక్స్ ఆఫీసర్ కె.నాగశ్రీనివాసరావు, ఏఈఓ బి.అప్పారావు, ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ అధికారి సీహెచ్ శ్రీను, గ్రామ వ్యవసాయ సహాయకులు వి.గణేష్, సీహెచ్ తిరుమల పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం పరిశీలన

నాదెండ్ల: నాదెండ్ల గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మండల స్థాయి అధికారులు శుక్రవారం పరిశీలించారు. మండల ప్రత్యేకాధికారి బీజే బెన్ని, ఎంపీడీఓ జాకీర్‌హుసేన్, హౌసింగ్ ఏఈ రామకృష్ణనాయక్, ఉపాధిహామీ పథకం ఏపీఓ పుష్పరాజు పాల్గొని పీఎం ఆవాస్ యోజనలో భాగంగా నిర్మిస్తున్న గృహనిర్మాణాలు పరిశీలించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



శావల్యాపురం: మండలంలోని బొందిలిపాలెంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఆర్.కుమార్‌రాజు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ రూ.13 లక్షలతో సిమెంట్ డ్రెయిన్లు, రెండు కల్వర్టు నిర్మాణ పనులు పారదర్శకంగా జరుగుతున్నాయన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు లోపించకుండా నిరంతరం అధికారుల పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు. సిమెంట్ డ్రెయిన్ల నిర్మాణానికి సంబంధించి బెడ్ పనులు నిమిత్తం స్థానిక ఇసుక వినియోగిస్తామని వివరించారు. కాంక్రీట్ పనులకు మాత్రం అమరావతి ఇసుకనే వినియోగించుతున్నామని డీఈ వెల్లడించారు. ఈసందర్భంగా సర్పంచి బోడాల వీరాంజనేయులు మాట్లాడుతూ అసత్యాప్రచారాలు చేయటం కాదని క్షేత్రస్థాయిలో పనుల నాణ్యత ప్రమాణాలను పరిశీలించాలని సూచించారు. ఆయనతో పాటు ఏఈ మూఢవత్ ఆకాష్, సచివాలయ ఇంజినీరు బసవరాజు, గ్రామస్తులు అల్లూరి వెంకయ్య ఉన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

చిలకలూరిపేట టౌన్: వృద్ధులను ఆదుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత అని 17వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పుల్లగూర అనూరాధ చెప్పారు. ఇటీవల వార్డు కౌన్సిలర్ అనూరాధ కుమార్తె రెమో వేద అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని బాపూజీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పుల్లగూర భరత్, మోషే పాల్గొన్నారు.

దోమకాటుతో అనారోగ్యం

నాదెండ్ల: పరిసరాల పరిశుభ్రత, చేతుల పరిశుభ్రతతో పలు అనారోగ్యాల బారి నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చని డాక్టర్ ఎల్.ప్రసాద్‌నాయక్ చెప్పారు. గణపవరం పీహెచ్‌సీ పరిధిలో పలు కాలనీల్లో సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు.

25న వ్యాసరచన పోటీలు

శావల్యాపురం: ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తహసీల్దారు షేక్ జాన్‌సైదులు శుక్రవారం తెలిపారు. అదే రోజు అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

సత్తెనపల్లి: మహిళ న్యాయవాదిపై దాడికి నిరసనగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయ వాదులు శుక్రవారం విధులు బహిష్కరించారు. కాకినాడ బార్ అసోసియేషన్ మహిళ న్యాయవాది పైడి అన్నపూర్ణపై జరిగిన దాడికి నిరసనగా విధులు బహిష్కరించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మారూరి లింగారెడ్డి చెప్పారు.